క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

కె.గంగవరం: అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఆర్థిక సాయం అందించి చేయూత నిచ్చారు. మండల పరిధిలోని అద్దంపల్లికి చెందిన రుద్రాక్షల వీరబాబు కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం వీరబాబుకు రూ.20 వేల చెక్కును అందించారు. రామచంద్రపురం మండలం వెల్ల సావరానికి చెందిన నందికొల్ల దుర్గాదేవి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. తమ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలను ఆదుకోవడంలో డీఎన్ఎఫ్ ముందంజ

కాజులూరు: ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడంలో డేగల నాగేంద్ర ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని బందనపూడి సర్పంచ్ డేగల తిరుమలవేణి అన్నారు. ఆదివారం ఆర్యావటం ఎస్సీ పేటలో అగ్ని ప్రమాద బాధితులకు డేగల నాగేంద్ర ఫౌండేషన్ రూ.3 లక్షల వ్యయంతో స్వచ్ఛంద నిర్మించిన నూతన గృహ నిర్మాణంలో డేగల తిరుమలవేణి, సత్యనారాయణ దంపతుల చేతుల మీదుగా గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నారై డేగల నాగేంద్ర మాట్లాడుతూ, ఆర్యావటంలో కుందాల భవానీ, లోవేశ్వరావులకు చెందిన ఇల్లు అగ్నికి ఆహుతవ్వడంతో స్థానిక బాబి ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు చందాల బాబి ద్వారా విషయం తెలుసుకుని తన తల్లిదండ్రులు డేగల తిరుమలవేణి, సత్యనారాయణ దంపతుల చేతుల మీదుగా 18 రోజుల క్రితం గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేయించానన్నారు. యుద్ధ ప్రాతిపదికన గృహ నిర్మాణం పూర్తి చేసి బాధిత కుటుంబీకులకు అందజేశామన్నారు. గృహ నిర్మాణం పనుల్లో తనకు సహకరించిన మిత్రులకు, డీఎన్ఎఫ్ ఫౌండేషన్ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో ఉపాధి పనులను గుర్తించేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ హెచ్.భానూజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2న ప్రారంభమైన గ్రామ సభలు నవంబర్ 4 వరకూ కొనసాగుతాయన్నారు. 15న అచ్యుతాపురం, నిసనమెట్ట, 18న నాగులచెరువు, వాకతిప్ప, 23న టేకి, నల్లూరు, 25న మాచర, వల్లూరు, 28న కోరుమిల్లి, కాలేరు, 31న వడ్లమూరు, నవంబర్ 4న అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లో ఉపాధి సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు.

వినాయక ఆలయానికి భక్తుల తాకిడి



విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారుజామున మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు స్వామికి విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 107 మంది పాల్గొన్నారు. స్వామికి ఒక భక్తుడు ఉండ్రాళ్ల పూజ జరిపారు. ఇరువురు చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. నలుగురు చిన్నారులకు అన్నప్రాశన జరిపారు. 11 మందికి తులాభారం నిర్వహించారు. శ్రీలక్ష్మీగణపతి హోమంలో 13 జంటలు, ఏడుగురు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామికి ముగ్గురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 45 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2320 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,52,410 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, ఏసీ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తపేట: మండలంలోని మోడేకుర్రు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మర్రి సత్యనారాయణ (60) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మోడేకుర్రు శివారు చినలంకకి చెందిన సత్యనారాయణ ఆదివారం రాత్రి ఇంటికి సమీపాన రోడ్డు పక్కనే నడచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

గండం గడిస్తే గట్టెక్కినట్లే!

- ఏటా ఈ సీజన్‌లో వర్షాలతో భయం
- ఈనిక, గింజ గట్టిపడే దశలో వరి పైరు
- ప్రస్తుతం ఆశాజనకం అంటున్న అధికారులు



గింజ గట్టిపడే దశకు చేరుకుంటున్న వరి పైరు

రాయవరం: దేశానికే అన్నం పెట్టే రైతులకు నోటికొచ్చిన పంట చేతికి అందడం లేదు.. ఏటా ఏదొక ప్రకృతి విపత్తు వారిని కుంగదీస్తోంది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను నీట ముంచుతోంది.. ప్రతి సంవత్సరం అక్టోబర్, నవంబర్ నెలల్లో సాధారణంగా తుపాన్లు ఏర్పడుతుంటాయి.. వర్షాలు పడుతుంటాయి.. ఈ గండం గడిస్తే ఖరీఫ్ నుంచి గట్టెక్కినట్లేనని పుడమిపుత్రులు అంటున్నారు. ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగానే ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో వరి పంట గింజ గట్టిపడే దశలో ఉండగా, కొంత ఆలస్యంగా నాట్లు వేసిన పొలాల్లో పాలు పోసుకునే దశకు చేరుకుంది. ఈ పరిస్థితుల్లో వాతావరణంలో మార్పులపై ఆందోళన చెందుతున్నారు.

రెండు నియోజకవర్గాల్లో...

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాల్లో రైతులు 1.01 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలో ఎంటీయూ 7029 (స్వర్ణ) రకం సుమారుగా 65 శాతం వరి సాగు చేస్తుండగా, మిగిలిన 30 శాతం ఎంటీయూ 1,318, మిగిలిన రకాలు ఐదు శాతం సాగు చేస్తున్నారు. ఈ ఏడాది జూలై మాసాంతానికి నియోజకవర్గంలో వరినాట్లు పూర్తయ్యాయి. ఈ నెలాఖరు నుంచి వరి కోతలు ప్రారంభమయ్యే అవకాశముంది. ఈ సీజన్‌లో ఎలుకల బెడదతో పాటు, కాండం తొలుచు పురుగు, ఎండాకు తెగుల బెడద అధికంగా ఉంది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు, అధికంగా యూరియా వినియోగంతో ఎండాకు తెగులు అధికంగా కనిపించింది. అయితే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో అదుపులోకి వచ్చిందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలించాయని, అయితే అల్పపీడనాలు, తుపాన్ల నుంచి గట్టెక్కితే మంచి దిగుబడులు వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

తడిసి మోపెడు..

అధిక శాతం విస్తీర్ణంలో రైతులు స్వర్ణ రకాన్ని సాగు చేశారు. స్వర్ణ రకం వరి కొద్దిపాటి గాలులకే నేలనంటుతుంది. గింజ గట్టిపడే దశలో నేలనంటితే ఆ వరిని తిరిగి కట్టలు కట్టి నిలబెట్టేందుకు రైతుకు అదనపు ఖర్చవుతుంది. పంట చేతికందివచ్చే సమయంలో తుపాన్లు, భారీ వర్షాలు కురిస్తే ఖర్చులు తడిసి మోపెడవుతాయన్న భయం రైతులను వేధిస్తోంది. గతంలో వచ్చిన నీలం, జల్, హుద్‌హుద్ తదితర తుపాన్ల కారణంగా ఏర్పడిన నష్టాలను గుర్తు చేసుకుని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తుపాన్ల బెడద లేకుంటే..



వరి పంట ఆశాజనకంగానే ఉంది. రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించి మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలి. విచ్చలవిడిగా పురుగు మందులు వాడితే అధిక పెట్టుబడుల బారిన పడరాదు. తుపాన్ల బెడద లేకుంటే రైతులకు అధిక దిగుబడులు వచ్చే అవకాశముంది.

– కేవీఎస్ రమేష్‌కుమార్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

ప్రకృతి సహకరిస్తేనే..



ప్రస్తుతం ఖరీఫ్ వరి సాగు చివరి దశకు చేరుకుంది. ఏటా పంట పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. కాండం తొలుచు పురుగు, ఎండాకు తెగులు నివారణకు రసాయనిక ఎరువులు పిచికారీ చేశాం. పంట చేతికి రావాలంటే ప్రకృతి సహకరించాలి. అప్పుడే గట్టెక్కుతాం.

– గొడితి శ్రీనివాస్, కౌలు రైతు, కూర్మాపురం

ప్రజలకు అండగా నిలవాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రస్తుత కూటమి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తెలిపారు. ప్రజలతో మమేకమై పార్టీ నాయకులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మండపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నాయకులతో పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ 15 నెలలకే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి పెరిగిందన్నారు. అన్ని రంగాల ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

ఉద్యమ కార్యాచరణపై నేడు సమావేశం



పిల్లి సూర్యప్రకాష్

రామచంద్రపురం: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం రాబోయే ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ పార్టీ ప్రజా ఉద్యమ కార్యాచరణ ప్రకటించిందన్నారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం తయారీతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలోని నెట్టిన కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలపై చర్చించేందుకు ముఖ్య నాయకులు, అనుబంధ విభాగ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ అబ్జర్వర్ చింతలపాటి శ్రీనివాసరాజు హాజరవుతారని పేర్కొన్నారు

నేడు నకిలీ మద్యం తయారీపై నిరసన

పట్టణ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జరగనున్న పార్టీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలన్న కూటమి ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ పార్టీ ప్రజా ఉద్యమ కార్యాచరణను ప్రకటించిందన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారీతో ప్రజల ప్రాణాలు ప్రమాదంలోకి నెట్టిన ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు.

దేశ రక్షణలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ కాకినాడ జిల్లా సేవా ప్రముఖ్ శ్రీనివాస్

రాయవరం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) దేశ సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆర్ఎస్ఎస్ కాకినాడ జిల్లా సేవా ప్రముఖ్ మామిడాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పసలపూడి సత్యసాయి ట్రస్ట్‌లో ఆదివారం ఆర్ఎస్ఎస్ శత వసంతోత్సవాలు నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ సేవక్ చింతా తమ్మిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ పూర్వ చరిత్రను, సాధించిన ఘన విజయాలు, దేశ సంరక్షణలో ఆర్ఎస్ఎస్ ముఖ్య పాత్రను ఆయన వివరించారు. ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆర్ఎస్ఎస్ పాత్ర, హిందూ ధర్మ సంరక్షణ గురించి తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సోమేశ్వరం మాచవరం, నదురుబాద, పసలపూడి గ్రామాలకు సంబంధించి విజయ దశమి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు నేమాని శర్మ, లక్ష్మణరావు, శ్రీసత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, రామచంద్రపురం పట్టణానికి చెందిన ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఎస్‌వీఎస్ శర్మ, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు కర్రి చిట్టిబాబు, దత్తాత్రేయ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ, సంఘం ఏర్పడి 100 ఏళ్లు పూర్తైన సందర్భంగా 2025 నుంచి 2026 వరకు దేశమంతా శతాబ్ది ఉత్సవాలు జరపాలని సంఘం నిర్ణయించిందన్నారు. దీనిలో భాగంగానే అక్టోబర్ 2 నుంచి 12 వరకు పలు సంఘ మండలాల్లో విజయదశమి ఉత్సవాలు జరుగుతున్నాయని సూచించారు. ప్రతి గ్రామంలో స్వయం సేవకులను తయారు చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సూచించారు. తొలుత ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి, ప్రసాద్, విజయలక్ష్మి, వీర రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శతాబ్ది ఉత్సవాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామచంద్రపురం ఖండ సహ కార్యవాహ బీవీబీఎల్ నారాయణ పాల్గొని ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు, విజయదశమి ఉత్సవం, వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించి సంఘ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయుధ పూజ చేసి, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ దేశం కోసం 100 ఏళ్లుగా చేస్తున్న అనేక సేవలు, ఆర్ఎస్ఎస్ చరిత్ర, ఆర్ఎస్ఎస్‌లో సేవ చేయాల్సిన ఆవశ్యకత గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఖండ ప్రచార ప్రముక్ గుబ్బల మురళీకృష్ణ, ఖండ కుటుంబ ప్రబోధన్ ప్రముక్ కోటి సత్య సూర్యనారాయణ, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై నేడు నిరసన

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం విక్రయాలను నిరసిస్తూ సోమవారం నిర్వహించనున్న ఆందోళనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం, మండపేట పట్టణ, రూరల్ మండలాల కన్వీనర్లు గూటం సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జీ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆందోళనలో పాల్గొనడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడుకోగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మండపేటలో నిర్వహించ తలపెట్టిన ఆందోళన అక్కడి పార్టీ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ర్యాలీగా తరలివెళ్లి ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేస్తామని వారు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అంబాజీపేటలో కొబ్బరితోటలో దున్నుతున్న రైతు


అంబాజీపేట: ప్రస్తుత వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని కొబ్బరి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచిస్తున్నారు. అక్టోబర్ చివర వారం లోను, నవంబర్ నెలలో కొబ్బరి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శాస్త్రవేత్తలు ఇప్పటికే రైతులకు వివరించారు. వర్షాకాలం చివరిలో కొబ్బరి రైతులు దుక్కులు బాగా చేసుకోవాలన్నారు. హరిత ఎరువులైన జనుము, పిల్లిపెసర, నత్రజని స్థాపన మొక్కల విత్తనాలను తోటల్లో చల్లుకోవాలన్నారు. కొబ్బరి కాయలను ప్రతి నెలా క్రమం తప్పకుండా సరైన సమయంలో దింపు తీసుకోవాలన్నారు. వర్షానికి ముంపునకు గురైన తోటల్లో నీటిని బయటకు పంపాలన్నారు. వర్షాధారంపై ఉన్న కొబ్బరి తోటల్లో రెండో దఫా ఎరువులను కొబ్బరి చెట్టు చుట్టూ 2 మీ దూరం, 25 సెం.మీ లోతు పళ్లాలు చేసుకోవాలన్నారు. సిఫారసు చేసిన ఎరువులను వినియోగించాలన్నారు. పచ్చిరొట్టను కోసి కొబ్బరిచెట్టు పళ్లెంలో వేసుకోవాలన్నారు. ప్రతి రైతు వీటిని ఆచరించడం వల్ల కొబ్బరి తోటలకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. శీతాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొబ్బరి చెట్లకు తెల్లదోమ ఆశిస్తుంది. దీనిని రైతులు తొలి దశలోనే గమనించి అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి లేని పక్షంలో డిసెంబర్ నెలాఖరు నాటికి తెల్లదోమ ఉధృతి అధికంగా ఉండి కొబ్బరి పంటను నాశనం చేస్తుంది. తెల్లదోమ కనిపించిన కొబ్బరి తోటల్లో పిచికారీ చేయాలని అందుకు సంబంధించిన పురుగులు స్థానిక ఉద్యాన పరిశోధన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కనుమరుగవుతున్న స్టాంపుల ప్రాభవం

- ఘనంగా తపాలా వారోత్సవాలు
- వివిధ స్టాంపుల సేకరణపై అవగాహన



ఏబీసీ దేవ్



వివిధ రకాల పోస్టల్ స్టాంపులు

కొత్తపేట: తంతి తపాలా శాఖ (పోస్టల్ డిపార్ట్‌మెంట్)లో స్టాంపుల పాత్ర ప్రాధాన్యం సంతరించుకుంది. కాలక్రమేణా సాంకేతిక విప్లవం విరాజిల్లుతున్న పరిస్థితుల్లో స్టాంప్స్ కనుమరుగవుతూ ప్రాభవాన్ని కోల్పోయాయి. ప్రస్తుత తపాలా వారోత్సవాల్లో భాగంగా ఆ శాఖ ఒకరోజు తపాలా బిళ్లల సేకరణ, వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్దేశించింది. తపాలా బిళ్లను మొట్టమొదటి సారిగా గ్రేట్ బ్రిటన్, ఐర్లాండ్‌లలో వాడినట్లు తెలుస్తోంది. ప్రజలకు 1840 నుంచి తపాలా బిళ్లలు (పోస్టేజ్ స్టాంప్స్) లేఖలు, మెయిల్ డెలివరీకి సహాయపడ్డాయి. 1835లో ఆంగ్ల ఉపాధ్యాయుడు, ఆవిష్కర్త, సంఘ సంస్కర్త రోలాండ్ హిల్ తపాలా కార్యాలయ సంస్కరణ కోసం ప్రచారం చేశాడు. 1837లో రోలాండ్ హిల్ మొదటి జిగురు తపాలా స్టాంపును కనుగొన్నాడు. ఒక పైసా ఖరీదు చేసే మొదటి తపాలా స్టాంపును రూపొందించాడు. అప్పటి నుంచి తపాలా స్టాంపుల చరిత్ర ప్రారంభమయింది. తద్వారా రోలాండ్ హిల్ తపాలా స్టాంపుల చరిత్రలో ఆవిష్కర్తగా గుర్తింపు పొందారు. భారతదేశంలో 1852 జూలై 1న సింధ్ జిల్లాలో మొదలయ్యాయని తెలుస్తుంది. వీటిని ఈస్ట్ ఇండియా కంపెనీ ముద్రించేది. అన్ని తపాలా బిళ్లలు కోల్‌కతాలో ముద్రించబడేవి. తొలుత అన్నీ కూడా విక్టోరియా మహారాణి చిత్రంతోనే విడుదలయ్యేవి. తరువాత ప్రపంచ దేశాల నాయకులు, జాతీయ నాయకులు, చక్రవర్తులు, చరిత్రకారులు, ప్రముఖులు, జంతువులు, పరిశ్రమలు, వివిధ సంస్థలు, పర్వతాలు, ప్రాంతాలు, ప్రాజెక్టులు తదితర చిత్రాలతో ముద్రించిన స్టాంపులను రూపొందించారు.

స్టాంపుల సేకరణ 'బుద్ధుడు'

సమాజంలో కొందరు అద్భుతమైన సేకరణలు జరుపుతుంటారు. ఆ సేకరణల్లో తపాలా బిళ్లలు (పోస్టు స్టాంప్స్) ఒకటి. కొందరు తమకు వచ్చిన కవర్లపై అతికించిన వాటిని. మరికొందరైతే ఎప్పటికప్పుడు విడుదలైన స్టాంపులను కొనుగోలు చేసేవారు. అటువంటి వారిలో కొత్తపేటకు చెందిన అద్దంకి బుద్ధచంద్రదేవ్ (ఏబీసీ దేవ్) ఒకరు. ప్రియదర్శినీ బాలవిహార్ కరస్పాండెంట్ అయిన బుద్ధుడు అనేకమైన అద్భుతమైన సేకరణల్లో భాగంగా అనేక దేశాలకు చెందిన తపాలా బిళ్లలను సేకరించారు. వాటిని ఆల్బమ్స్‌గా తయారుచేసి వాటిని తన విద్యా సంస్థలో విద్యాబోధనలో ఒక భాగంగా ఉపయోగిస్తారు. ఎంతో శ్రమించి సేకరించిన ఆయా స్టాంపులను విభజించి విద్యార్థులకు అర్థమయ్యేలా వాటిని విద్యాబోధనలో ఉపయోగిస్తున్న దేవ్‌ను తపాలా వారోత్సవాల సందర్భంగా 'సాక్షి' కలిసింది. స్టాంప్స్ సేకరణపై ఆయన ఆసక్తిని ప్రశ్నించింది. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. తన తండ్రి కేశవరావు నుంచీ తనకు స్టాంపుల సేకరణ అలవడింది. నా పదో ఏట నుంచి సుమారు 50 ఏళ్ల నుంచి సేకరిస్తున్నాను. సుమారు 900 స్టాంపులు నా వద్ద ఉన్నాయి. పోస్టల్ డిపార్ట్‌మెంట్ కొత్తగా విడుదల చేసిన వెంటనే ఆ స్టాంప్ కొనుగోలు చేయడం నా హాబీ. దాని గురించి, ఆ స్టాంప్ విడుదల వెనుక కారణాలను విద్యార్థులకు వివరిస్తాను. ఇలా నా విద్యా సంస్థలో అనేక అద్భుత సేకరణలు ఉన్నాయి.

ఏటిగట్టుపై దిగబడిన కారు



పెదపట్నం ఏటిగట్టుపై మట్టిలో దిగబడిన కారు

మామిడికుదురు: అర కిలోమీటరు దూరం ఉన్న ఏటిగట్టుపై పక్కా రోడ్డు నిర్మించాలని ఎంతో కాలం నుంచి ప్రజలు వేడుకుంటున్నా దాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో పెదపట్నం గ్రామ ప్రజలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి పెదపట్నం రత్నాపురం వెళ్లే మార్గంలో ఏటిగట్టుపై శనివారం రాత్రి మట్టిలో కారు దిగబడిపోయింది. రాత్రి సమయం కావడం, ఇక్కడ పరిస్థితులు తెలియక పోవడంతో స్థానికేతరులు కారులో వచ్చి ఏటిగట్టుపై మట్టి రోడ్డులో కారు దిగబడిపోయి దాన్ని అక్కడే విడిచి వెళ్లిపోయారని స్థానికులు తెలిపారు. ఈ మార్గంలో మట్టి రోడ్డు స్థానే పక్కా రోడ్డు నిర్మించి ఇబ్బందులను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఎంతో దగ్గరగా ఉండే ఈ మార్గంలో ఇప్పటికైనా రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని కోరుతున్నారు.

పీఏడబ్ల్యూఎస్ జిల్లా అధ్యక్షురాలిగా 'కల్యాణి'



కల్యాణి



రామయ్య



శేషగిరి

రామచంద్రపురం: ప్రాక్టీసింగ్ అడ్వొకేట్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలిగా నందిక కల్యాణి నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి గౌరీమణి వీరిని నియమించారు. ఆమెతో పాటు జిల్లాకు చెందిన న్యాయవాదులు రామయ్యను, సొసైటీ రాష్ట్ర వెల్ఫేర్ విభాగానికి ఉపాధ్యక్షుడిగా, కోనసీమ జిల్లాకు కొప్పిశెట్టి శేషగిరిని సొసైటీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ నియామకం పట్ల పట్టణ ప్రముఖులు, సహచర న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

రవికుమార్‌కు మాతృ వియోగం



చల్లా లక్ష్మి (ఫైల్)

కపిలేశ్వరపురం (మండపేట): మండపేటకు చెందిన జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వర్గ ప్రత్యేక ఆహ్వానితుడు, ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా రవికుమార్ మాతృమూర్తి లక్ష్మి (81) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి అశోక్, ఫిజియోథెరపిస్ట్ అసోసియేషన్ నాయకుడు హైదర్ ఆలీ, పర్యావరణ పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కేవీవీ సత్యనారాయణ, వివిధ ప్రజా సంఘాల నాయకులు గండి స్వామిప్రసాద్, కె.కృష్ణవేణి తదితరులు నివాళి అర్పించారు.

వాస్తు సిద్ధాంతి మృతి



రాముడు

కె.గంగవరం: మండల పరిధిలోని కూళ్ల గ్రామానికి చెందిన ప్రముఖ వాస్తు సిద్ధాంతి రాముడు (యర్రంశెట్టి రామకృష్ణ) అనారోగ్యంతో మృతి చెందారు. కూళ్ల గ్రామంతో పాటు పరిసర ప్రాంత వాసులకు వాస్తు, జ్యోతిష్యం చెప్పడంలో రాముడు ప్రసిద్ధులు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం మృతి చెందారు. దీంతో గ్రామంలోని పలువురు పెద్దలు ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

బాణసంచా అనధికార నిల్వలపై నిఘా



ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: మండలంలో అనధికార బాణసంచా నిల్వలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై మోహన్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, దీపావళి పండుగ పురస్కరించుకుని మండల గ్రామాల్లో బాణసంచా విక్రయాలు చేపట్టతలచిన వ్యాపారులు తప్పనిసరిగా అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, పరిమితికి మించి సరకు నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులు అమ్మకాల సమయంలో ఉన్నతాధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మండల గ్రామాల్లో ఎక్కడైనా వ్యాపారులు అనధికారికంగా బాణసంచా నిల్వలు ఉంచితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయాలి

ఆలమూరు: జిల్లాల పునర్విభజన జరుగుతున్నందున ఆలమూరు మండలాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ మండల ప్రజా సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. జొన్నాడ రైతు భవనం (పెద్ద కళ్యాణ మండపం) వేదికగా ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం అన్ని రంగాలు రాజమహేంద్రవరంతోనే అనుబంధం ఉండటంతో పాటు, జిల్లా కేంద్రమైన అమలాపురం దూరంగా ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అందులో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలిపే అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ ఉద్యమ కార్యాచరణకు తగిన ప్రణాళిక రూపొందిస్తామని హెచ్చరించారు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండలాన్ని తూర్పుగోదావరిలో కలపాలని తీర్మానాలు సేకరిస్తున్నామని ఈసందర్భంగా ఐక్యవేదిక నేతలు తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులకు త్వరలో వినతి పత్రాలు అందజేసి వారి మద్దతును కోరతామన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది సభ్యులతో జేఏసీ కమిటీని ఏర్పాటు చేసి, ఐదుగురు సభ్యులతో స్టీరింగ్ కమిటీని నియమించారు. ఐక్యవేదిక నేతలు ఆలమూరు మండలాన్ని తూర్పులో విలీనం చేయాలని నినాదాలు చేశారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే

కొత్తపేట: సమాజానికి దిశ, దశ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ అన్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన కాటూరు వంశీకిరణ్, ఎలక్కాయల మణికుమారి, బూర్ల భవాని, చిట్టూరి హిమబిందు, బట్టు శ్రీనుబాబు ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు కేవీ శేఖర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో పాటు సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డు, గూడపాటి మాణిక్యాలరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.